## సిపాయి కథలు

# టోలోలింగ్

కాటూరు రవీంద్రత్రివిక్రమ్

"మేజర్‌సాబ్" – ఆ పిలుపుకి తలతిప్పి చూసాడు మేజర్ రాజేష్.

"మీకు ఉత్తరం వచ్చింది" అంటూ సుబేదార్‌సింగ్ ఒక కవరు అతని చేతిలో ఉంచాడు. చీకట్లు ముసురుకుంటున్న ఆ సమయంలో కేవలం ఉత్తరం మీద చిరునామా చదవగలిగాడు మేజర్ రాజేష్. అది తన అర్ధాంగి కిరణ్ రాసిన ఉత్తరం. పది నెలల క్రితమే తమ వివాహం అయింది.

ఒక్కమాటు మల్లెపూల గుబాళింపులా, ఆ స్మృతులు మనసును తాకాయి.

ప్రేమగా, అమాయకంగా, దీనంగా తన కళ్లలోకి చూస్తు వీడ్కోలు చెబుతున్న భార్య మొహం కళ్లముందు కదలాడింది.



"త్వరలో వస్తారు కదూ?"

"తప్పకుండా వస్తాను..."

"నన్ను మీతో తీసుకెళ్తారు కదూ?"

"తప్పకుండా తీసుకెళ్తాను..."

"నాకు ఢిల్లీ అంతా చూపిస్తారా?"

"ఆగ్రా కూడా చూపిస్తాను..."

"ఆగ్రాలో తాజ్‌మహల్..." అంటూ ఆగి పోయింది.

నవ్వి "ముందు అదే చూపిస్తాను... ఎందుకంటే - నువ్వు నా హృదయరాణివి..." ఆమె సిగ్గులమొగ్గ అయింది. ఆమెను గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. ఆమెకు ఆ క్షణం ఉక్కు కోటలో సురక్షితంగా ఉన్నట్లనిపించింది. మెల్లగా కౌగిలి వదులు చేస్తూంటే, పట్టుదప్పి శిఖరం మీద నుంచి లోయలోకి దొర్లిపోతు న్నట్లుంది.

"మేజర్‌సాబ్..." ఆ పిలుపుకి త్రుళ్లిపడి ప్రస్తుతంలోకి వచ్చాడు రాజేష్. 'ఏమి'టన్నట్లు చూసాడు.

"మీకు వైర్లెస్ కాల్..." అంటు ఫోన్ చేతికిచ్చాడు సుబేదార్‌సింగ్. అందుకుని మాట్లాడాడు.

"టోలోలింగ్ శిఖరం మీద శత్రువు తిష్టవేసి ఉన్నాడు. ఆ స్థావరాన్ని ఈ రాత్రికి మీరు పట్టుకోవాలి" - ఆపరేషన్స్ కమేండర్ ఆదేశం.

"తప్పకుండా పట్టుకుంటాం సార్" దృఢంగా అన్నాడు మేజర్ రాజేష్.

"పరిస్థితిని ఎప్పటికప్పుడు మాకు తెలుపుతూండండి"

"అలాగే సార్..."

"విష్‌యూ ఆల్ ద బెస్ట్..."

"థాంక్యూ సర్... జైహింద్..."

"జైహింద్..."

> సిపాయిలు దేశమాతకి ముద్దు పాపాయిలు. ప్రాణాలను పణంగా పెట్టి, మన సరిహద్దుల్ని సదా రక్షిస్తూంటారు. వారి వీరగాథలు యువతకి ఆదర్శం, స్ఫూర్తిదాయకం కావాలి.
>
> ఈ కథలు వాస్తవ సంఘటనల నేపథ్యంతో రచించబడ్డాయి. రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ 1964 నుంచి 1980 వరకు (16 సం॥లు) వైమానిక దళంలో పనిచేసిన కాలంలో స్వయంగా రెండు యుద్ధాలలో పాల్గొన్నారు. మిలట్రీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అనేక మంది యుద్ధ వీరుల విజయగాథల గురించి వివరాలు సేకరించారు. యుద్ధరంగం వేదికగా, దేశభక్తి ఊపిరిగా, త్రివిధ దళాల యుద్ధవీరులు సజీవ పాత్రలుగా వెలువడుతున్న ఈ ప్రత్యేక కథలు 'కథాకేళి' పాఠకులకు ప్రత్యేకం.

ఫోను సుబేదార్‌సింగ్ చేతికిస్తూ "మన వాళ్లందరూ రెడీయేనా?" అడిగాడు మేజర్ రాజేష్.

"అందరూ రెడీగా ఉన్నారు సార్"

"ఒకసారి పిలవండి" - భార్య ఉత్తరాన్ని చదవకుండానే జేబులో పెట్టుకున్నాడు.

సుబేదార్‌సింగ్ పిలవగానే అందరూ క్షణల్లో వచ్చి ఎదురుగా నిల్చుని 'శాల్యూట్' చేసారు. తను కూడా శాల్యూట్ చేసి "మిత్రులారా! మరికొద్ది నిమిషాల్లో మనం ఎదురుగా ఉన్న 'టోలోలింగ్' శిఖరం ఎక్కబోతున్నాం. దీని ఎత్తు 16,000 అడుగులు. మన గ్రెనేడియర్ దళ సభ్యులకిలాంటివి కొత్తేమీ కాదు. ఎటొచ్చీ మనం ప్రతి అడుగూ ఎంతో జాగ్రత్తగా ముందుకుసాగాలి. అధికభాగం నేలబారుగా పాకాల్సి ఉంటుంది. శత్రువుల దగ్గర అత్యాధునికమైన, చీకట్లో సైతం చూడగల బైనాక్యులర్స్ ఉన్నాయి. మన కదలికల్ని పసిగట్టే ఎలక్ట్రానిక్ సెన్సర్లున్నాయి. అలాగని మనం భయపడాల్సిందేమీ లేదు. ఎందుకంటే మన దగ్గర మాత్ర




దేశభక్తి అనే మహత్తరమైన ఆయుధం ఉంది. శత్రువుల దురాక్రమణ నుంచి మన మాతృ భూమిని రక్షించుకోవటం లో ఏ త్యాగానికైనా మనం సిద్ధం. అవునా, కాదా?"

"అవును! మనం ఏ త్యాగానికైనా సిద్ధం..." అందరూ ముక్తకంఠంతో అన్నారు. "శభాష్!" అని ప్రశంసగా చప్పట్లు కొట్టాడు.

"విజయమో వీరస్వర్గమో! రెండూ మనకి ఒకటే... ఒక్కొక్కరం కనీసం పదిమంది శత్రువుల్ని చంపాలి... ఈ రాత్రికే టోలోలింగ్ స్వాధీనం చేసుకోవాలి..."

"మేమందరం సిద్ధంగా ఉన్నాం సాబ్"

"సరే – ప్రయాణానికి సిద్ధంకండి" అంటు తను కూడా సిద్ధమయాడు మేజర్ రాజేష్.

టోలోలింగ్ పర్వతం మీద క్రమంగా మంచువాన పెద్దదయింది.

ఉష్ణోగ్రత మైనస్ ఆరు డిగ్రీలకు పడి పోయింది.

మేజర్ రాజేష్ దళసభ్యులు మొత్తం పదిమంది. వారికి అతనే కమేండర్. సభ్యుల్లో వివిధ ర్యాంకుల వాళ్ళున్నారు. యుద్ధరంగంలో ఉన్నప్పుడు అందరూ ఒక కుటుంబ సభ్యుల్లా ఆత్మీయంగా మెలుగుతారు. కమేండర్ ఆదేశాన్ని సుగ్రీవాజ్ఞలా తలదాలుస్తారు. అనుక్షణం ఒకరి క్షేమాన్ని ఒకరు ఆకాంక్షిస్తూంటారు. కర్తవ్య నిర్వహణలో కరుగ్గా, కఠినంగా ఉంటారు.

మేజర్ రాజేష్ స్వస్థలం నైనిటాల్.

చిన్నతనం నుంచీ అతనికి సాహసకృత్యాల పట్ల మక్కువ ఎక్కువ. ఆటల్లో, వ్యాయామ క్రీడల్లో, ఎన్.సి.సి.లో మెరిట్ విద్యార్థిగా ఉండేవాడు. ఆర్మీలో చేరి ప్రత్యక్ష యుద్ధాల్లో పాల్గొనాలని కలలుకనేవాడు. అతడి మిత్రుడి తండ్రి ఆర్మీలో బ్రిగేడియర్‌గా రిటైరయ్యాడు. ఆయన తన గతానుభవాలను ఆసక్తికరంగా చెబుతూంటే, రాజేష్ చెవులప్పగించి, కన్నార్పకుండా వింటూండేవాడు. అతని ఆసక్తిని గమనించి బ్రిగేడియర్ ఇంకా ఉత్సాహంగా చెబుతూండేవాడు. ఆర్మీలో ఎలా చేరాలి, ట్రయినింగ్ ఎలా

ఉంటుంది, ఎన్నాళ్లుంటుంది - వగైరా వివరా లన్నీ తరచి తరచి తెలుసుకునే వాడు.

చివరకి అతని స్వప్నం ఫలించి, ఆర్మీలో సెలక్టయ్యాడు. అక్కడ కూడా మెరిట్‌లోనే ఉత్తీ ర్ణుడయ్యాడు. విధుల నిర్వహణలో మంచి పేరు తెచ్చుకుని మేజర్‌గా పదోన్నతి పొందాడు.

కార్గిల్ దురాక్రమణదారుల్ని తరిమి వేయ డానికి 'టోలోలింగ్' శిఖరం మీదున్న స్థావరాన్ని పట్టుకొనే బాధ్యత అతనికి అప్పగించడం జరి గింది. మొత్తం మూడు దళాలు అక్కడ నియ మించబడ్డాయి. ఒక్కోదళంలో పదిమంది సభ్యు లున్నారు. రాజేశ్ దళం పురోగమించిన తరు వాత మరొక వైపు నుంచి రెండవ దళం పురోగ మిస్తుంది. ఇంకొక వైపు నుంచి మూడవ దళం పురోగమిస్తుంది. శత్రువు ఏకా గ్రతని భగ్నం చేసి, తాము ఎంతమందో, ఎటు వైపు నుంచీ వస్తున్నారో తెలియని అయో మయం కల్పించి, మెరుపుదాడులతో శత్రువుల్ని మట్టుబెట్టి, స్థావరాన్ని కైవసం చేసుకోవడం ప్రధాన వ్యూహం.

కార్గిల్ యుద్ధం ఇంతవరకూ భారత-పాకిస్థాన్‌ల మధ్య జరిగిన అన్ని యుద్ధాలకంటే భయంకరమైనది. కారణం - దుర్గమ శిఖరాలు, ప్రాణాలు తీసే చలి, ప్రతికూలమైన యుద్ధ రంగం. శత్రువులు శిఖరం మీద - మనం నేల మీద! పైకి ఎగబ్రాకుతున్న సైనికుల్ని మట్టు బెట్టడం బహు సులభం. అలా ఎందరో ప్రాణా లు కోల్పోయారు.

కార్గిల్‌ని కైవసం చేసుకోవడం ద్వారా పాకిస్థాన్, వాస్తవాధీన రేఖని బలప్రయోగంతో మార్చడానికి, వ్యూహపరంగా కీలకమైన శ్రీన గర్ - వే జాతీయ రహదారిని ధ్వంసం చేయ డం, కాశ్మీర్ లోయలోకి చొరబడడానికి కొత్త మార్గాలు సృష్టించుకోవడం - ప్రధాన లక్ష్యా లుగా పెట్టుకుంది.

ఈ లక్ష్యాలు నెరవేరకుండా చేయడమే భారత సైన్యం బాధ్యతగా తయారయింది. ఒక ప్రక్క 'లాహోర్'లో శాంతి సమావేశం, మరొక ప్రక్క కార్గిల్‌లో సమరం - పాకిస్థాన్ కుటిల త్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.

మాతృదేశ రక్షణ కోసం భారతసైన్యం ఉక్కుపాదంతో ముందడుగు వేసింది. శిఖ రాగ్రాల మీద తిష్టవేసుకున్న చొరబాటు దా రుల్ని, పాక్ సైనికుల్నీ తరిమికొట్టడానికి పూనుకుంది.

మేజర్ రాజేష్‌కి ఆ విధంగా 'టోలోలింగ్' శిఖర విముక్తి బాధ్యత అప్పగించబడింది.

"మేజర్ రాజేష్! ఎక్కడున్నారు మీరు?" - వైర్‌లెస్‌లో కమేండర్ పిలుపు.

"శిఖరాన్ని సగం వరకూ ఎక్కాముసార్. మెల్లగా ముందుకుసాగుతున్నాం"

"వెరీగుడ్... ముందుకు సాగండి! మధ్య మధ్య సమాచారం ఇవ్వండి"

"అలాగే సార్..."

మేజర్ రాజేష్ వైర్‌లెస్‌ని సర్దిపెట్టు కుం టూండగానే, శిఖరం పైనుంచి తూటాల వర్షం మొదలయింది. రాళ్లచాటున నక్కి కదలకుండా ఉండిపోయారు కొద్ది క్షణాలు. తూటాలు తగిలి, రాళ్లు ముక్కలుగా పేలి పోతున్నాయి. మంచు పొగ చెలరేగుతోంది.

ఇక లాభం లేదని "ఫైర్" అంటూ కేకవేసి, శిఖరం వైపు ఏకే - 47 గురిపెట్టి కాల్పులు ప్రారంభించాడు. అతని దళ సభ్యులు కూడా గురి పెట్టి, కాల్పులు వస్తున్న దిశగా తూటాలు గుప్పించారు.

కొద్దిసేపు అలా తూటాల సమరం సాగాక, కాస్సేపు నిశ్శబ్దం ఆవరించింది. "ఫాలోమీ"




అంటు మేజర్ రాజేష్ శిఖరం మళ్లీ ఎక్కడం ప్రారంభించాడు. అతి కష్టం మీద వెయ్యి అడుగులు ఎక్కారు. మళ్లీ పైనుంచి కాల్పులు - క్రింద నుంచీ ప్రతి కాల్పులు - కాస్త విరామం. మళ్లీ ఎక్కడం. ఇలా ఆ చలి రాత్రిలో మేజర్ రాజేష్ దళ సభ్యులు 'టోలోలింగ్' శిఖరం వైపు వెళ్తూనే ఉన్నారు.

శత్రువుల తూటాలకు మొదట సుబేదార్ సింగ్ వీర స్వర్గమలంకరించాడు. అది గమనించిన సహచరులు మనసులోనే అతనికి నివాళులర్పించి, కర్తవ్యపాలనలో ముందుకు సాగారు. ఆ తరువాత ఒకరి తరువాత ఒకరుగా ముగ్గురు మరణించారు. మేజర్ రాజేష్ తన దళ సభ్యులకి మూడు మీటర్ల ముందుగా, ఎలాగైనా సరే శిఖరం కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ముందుకు సాగాడు. సహచరులు అనుసరిస్తూనే ఉన్నారు. ఇంక ఇరవై మీటర్ల దూరంలో ఉండగానే రాజేష్ ఛాతీలో శత్రువుల తూటాలు దిగబడ్డాయి.

వైర్‌లెస్ మ్రోగింది.

"సార్! శత్రుస్థావరానికి ఇరవైమీటర్ల దూరంలో ఉన్నాం. మేము సాధించాం సార్..." అంటూండగానే అతని శ్వాస ఆగిపోయింది.

"మేజర్ రాజేష్..." కమేండర్ ఆదుర్దాగా అరవడం ఆ నిశీధిలో స్పష్టంగా వినిపిస్తోంది. వెనుకగా వస్తున్న సహచరులు శత్రుస్థావరం మీద గ్రెనేడ్లు విసిరి ధ్వంసం చేసారు. శత్రువులు పూర్తిగా నాశనమయ్యారు. అత్యంత కీలకమైన 'టోలోలింగ్' భారత సైన్యం వశమైంది. అక్కడ త్రివర్ణ పతాకం రెపరెపలాడింది.

ఆ మర్నాడు మేజర్ రాజేష్ భౌతికకాయం అతని స్వస్థలం నైనిటాల్‌కి చేర్చబడింది.

నదీ తీరంలో బంధువులు, మిత్రులు, అభిమానుల నివాళులతో పెద్దన్నగారి సమక్షంలో 'మేజర్ రాజేష్' అంత్యక్రియలు జరిగాయి. ఆయన ఇప్పుడు వీరస్వర్గంలో ఉండి, మరొకసారి భరతభూమిలో జన్మించడానికి నిరీక్షిస్తున్నాడు. ●